# తోడు

—టీవీయస్మూర్తి

రంగనాధంగారి చిన్నపాప రమ. వయసు ఐదేళ్ళుంటాయి. మంచి చలాకీయే కాదు చూడ చక్కని బొమ్మ అనుకోండి.

నోరు తెరిస్తే మాత్రం ఎవరూ ఐదేళ్ళ పిల్ల మాట్లాడుతున్నట్లుగా అనుకోరు. అంత ఆరిందాలా మాట్లాడుతుంది. ఏ విషయం కూడా వదిలిపెట్టదు తగుదునమ్మా అని.

చిన్ని రమకు చక్కటి చిక్కటి ఓ ముద్దమందారంలాటి అక్క వుంది. పేరు ముద్దమందారం కాదుగానీ అలాటిదే 'పద్మ'.

పద్మ కాలేజీలో చదూతోంది యింటర్ రెండో సంవత్సరం. మరి పద్మ రోడ్డుమీదకొస్తే మాత్రం ఎన్నో జతల అబ్బాయిల కళ్ళు పద్మ వెంట ఉమన్స్‌కాలేజీ వరకూ మార్చ్‌ఫాస్ట్ జేస్తాయంటే అతిశయోక్తి కాదు.

ఓ రోజు రమ వాళ్ళమ్మగారు బజారుకెళ్ళి సాయంత్రం పేరంటానికి వెళ్ళడానికి తను కట్టుకోబోయే చీరకు మేచింగ్ గాజులు తెచ్చిపెట్టమంది.

పేపర్ తిరగేస్తున్న రంగనాధంగారి దగ్గరకెళ్ళి 'డాడీ! నాకు ఐదు రూపాయిలు కావాలి' అంది.

“ఏవిటి నాన్నా ఎందుకూ.. ” అన్నారు ముద్దుగా.

'అర్జంట్‌గా అమ్మకి నీలంరంగు గాజులు కావాలిట,తేవాలి. .'చెప్పేసింది.

యిస్తాగానీ మరొక్కదానివే వెళ్తావా! కాసేపాగితే నేనే పోయి తెచ్చిపెడ్తాలే' అన్నారు.

'పర్లేదు నాన్నా. నే నెక్కడికి వెళ్ళినా నా గురించి నువ్వేం భయపడకు ” అంది ఆరిందాలా.

'ఛ వూరుకోవే. ' మరీ ఆరిందాలా మాట్లాడుతున్నావ్.. ' అన్నారు మందలింపుగా.

'కాదులే డాడీ.. నేను బయటికెళ్తే మన వీధిలో కుర్రాళ్ళు రాజూ, ఆనందూ, గోపాల్, ఎదురింటి సురేష్ అంతా వెనకే వస్తారు ప్రైమ్‌మినిస్టర్ ముందూ వెనకా సెక్యూరిటీ పైలెట్స్ మాదిరిగా. మళ్ళీ మన యింటిదాకా తెచ్చి వదిలి మరీ వెళతారు '

'ఛ... వూరుకోవే మరీ మాట్లాడతావే వాళ్ళంతా నీ వెనకే ఎందుకు వస్తారమ్మా వాళ్ళకేం పనుల్లేవా.. ' అన్నారు రంగనాధంగారు ఈసారి నిజంగానే రమ మాటలు అర్థంకాక.

'నేను పద్మ అక్కను తోడు తీస్కెళతా కదా డాడీ ఎక్కడికి వెళ్ళినా ....' అసలు సంగతి చెప్పేసింది సిసింద్రీ రమ.

రంగనాధంగారు 'అఁ....' అంటూ నోరు తెరిచేరు. *